సాక్షి నిర్మల్

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తానూరు, కుంటాల, సారంగపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. 8లో ▸



జాతరలకు వేళాయె

జిల్లాలోని కుంటాల గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా జాతర ప్రారంభమైంది. అలాగే ముజ్గి మల్లన్న, మల్లన్న దేవుని జాతరల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 / 19.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రేపు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

నిర్మల్‌ఖిల్లా: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై శుక్రవారం ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ సమీపంలోగల హోటల్ బాలాజీ ఇన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సంప్రదాయ, అసంఘటిత రంగాల్లో చేతి పనిముట్లతో వస్తువులను ఉత్పత్తి చేస్తున్న పలు వృత్తుల్లోని కార్మికులు ఆధునిక ఉపకరణాలు వినియోగించుకోవడానికి ఈ సదస్సు ఉపకరిస్తుందని తెలిపారు. వృత్తి కళాకారులు, హస్త కళాకారులు సంప్రదాయ వృత్తులను పరిరక్షిస్తూ.. మరింత పురోగతి సాధించేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 18 వృత్తులు, వివిధ ఉపాధి రంగాల్లో పనిచేస్తున్న వారంతా పాల్గొనాలని కోరారు.

నేడు ఉద్యోగమేళా

భైంసాటౌన్: ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలకు 'హెచ్‌సీఎల్ టెక్–బీ' జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నోడల్ అధికారి పరశురాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీసీ, ఎంఈసీ చదివి 2024లో ఇంటర్ పూర్తి చేయనున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. అన్ని సబ్జెక్టులు కలిపి 75శాతం మార్కులు, గణితంలో 60 శాతం మార్కులు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకుగాను పది, ఇంటర్ ఫస్టియర్ మార్క్స్ మెమో, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరు కావాలని, వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధిని 9493553821, 8074065803 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్యాంపులో పీఏసీఎస్ డైరెక్టర్లు!

కుంటాల: కుంటాల పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాంపై ఇటీవల పలువురు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ ఇన్‌చార్జి డీసీవో నర్సయ్యకు తీర్మానం కాపీ అందజేశారు. దీంతో ఈనెల 27న బలనిరూపణ పరీక్షకు హాజరుకావాలని డీసీవో సూచిస్తూ డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. కాగా, చైర్మన్‌పై సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టడం చర్చనీయాంశమైంది. సొసైటీలో 13మంది డైరెక్టర్లుండగా, అవిశ్వాసంలో నెగ్గాలంటే తొమ్మిది మంది మద్దతు అవసరం ఉంటుంది. దీనిపై క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయి. అవిశ్వాస పరీక్షకు మరో ఐదురోజులే గడువు ఉండడంతో పలువురు డైరెక్టర్లు బుధవారం విహారయాత్రకు వెళ్లినట్లు సమాచారం. దీంతో కుంటాలలో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

మొదటిరోజే జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బొమ్మన సురేశ్

నిర్మల్‌ఖిల్లా: ఆశ కార్యకర్తలకు నెలనెలా మొదటిరోజే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించే తమకు తగిన పారితోషకం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహించిన తమకు ఇప్పటివరకు పారితోషకం చెల్లించలేదని గుర్తు చేశారు. సీఐటీయూ అధ్యక్షురాలు పీ గంగామణి, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు సుజాత, భైంసా డివిజన్ కార్యదర్శి సరిత, ఖానాపూర్ డివిజన్ అధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్: గర్భిణులకు పంపిణీ చేసే న్యూట్రిషన్ కిట్లను డీఎంహెచ్‌వో పక్కదోవ పట్టిస్తున్నారని అఖిలభారత మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సంగీత, కార్యదర్శి స్వరూప ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. డీఎంహెచ్‌వో చర్యలపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు పీటర్, సురేందర్ ఉన్నారు.

'విద్యుత్ కోతలు లేవు'

భైంసాటౌన్: విద్యుత్ కోతలు లేవని ఎస్‌ఈ జైవంత్ చౌహాన్ తెలిపారు. డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం నిర్వహించిన వీసీలో ఆదేశించినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 3.25 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం లక్ష్యం కాగా, 3.87 మిలియన్ యూనిట్లు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. సమస్య ఉంటే సంప్రదించాలని సూచించారు. డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్య ఉన్నారు.

'వెయ్యిఉరులమర్రి'.. స్ఫూర్తికేంద్రం





రాంజీగోండు మ్యూజియం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రులు (ఫైల్)

- భూమిపూజ చేసినట్లు ప్రకటించిన 'బండి'
- ఏడాదిలో నిర్మిస్తామని సంజయ్ హామీ
- అన్ని పార్టీలు సహకరించాలని వినతి
- ఏళ్లుగా అక్షర సమరం చేస్తున్న 'సాక్షి'
- ఇన్నాళ్లకు అమరులకు వస్తున్న గుర్తింపు
- ఇటీవలే రాజధానిలో మ్యూజియం

నిర్మల్: ఎప్పుడో.. 1857లో ప్రథమ భారతస్వాతంత్ర్య సంగ్రామానికి కొనసాగింపుగా పోరాడిన వీరులువాళ్లు. ఏకకాలంలో ఆంగ్లేయ, నైజాం సైన్యాలతో వీరోచితంగా పోరాడిన ధీరులువాళ్లు. ఒకే మర్రిచెట్టుకు కట్టిన ఉరికొయ్యలకు ఒకేసారి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన అమరులు. అలాంటి వీరుల చరిత్ర ఇప్పటికీ నేటితరానికి అందడం లేదు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వచ్చినా.. రాష్ట్రంలో ప్రభుత్వాలే మారినా.. మనదైన ఘనచరిత్రకు మాత్రం దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపు రాలేదు. ఇన్నాళ్లకు రాంజీసహా వెయ్యిమంది అమరుల త్యాగాలకు విలువ దక్కుతోంది. ఈనెల 16న హైదరాబాద్‌లో రాంజీగోండు పేరిట గిరిజన మ్యూజియాన్ని ప్రారంభించారు. తాజాగా బుధవారం జిల్లాకేంద్రంలో వెయ్యిఉరుల మర్రిప్రాంతంలో 'రాంజీగోండు స్ఫూర్తికేంద్రం' నిర్మాణానికి భూమిపూజ చేశారు.

స్థానికులకే తెలియదు..

దేశ స్వాతంత్ర్య చరిత్రలో అత్యంత క్రూరమైన ఘటనగా పుస్తకాలకెక్కిన జలియన్‌వాలాబాగ్ ఘటనకంటే.. 60ఏళ్ల ముందే నిర్మల్‌లో ఒకేచెట్టుకు వెయ్యిమంది ఆదివాసీ వీరులు ప్రాణాలు అర్పించారు. కానీ.. చరిత్రలో ఎక్కడా ఈ ఘటనకు సంబంధించిన అక్షరం రాసింది లేదు. దారుణమేమంటే.. ఎక్కడైతే వెయ్యిమంది అమరవీరులు తమ ప్రాణాలను బలిదానం చేశారో.. అక్కడే వారికి సరైన గుర్తింపు కూడా లేదు. సాక్షాత్తు ఆ ఘటన జరిగిన నిర్మల్ జిల్లాకేంద్రంలోనే ఇప్పటికీ



వెయ్యిమంది అమరుల స్తూపం

చాలామందికి ఈ చరిత్ర కూడా తెలియకపోవడం అత్యంత శోచనీయం. నాటి స్వాతంత్ర్య సంగ్రామంతో పాటు అనంతరం కుమురంభీం లాంటి వీరుల పోరాటాలకు ఆదర్శంగా నిలిచిన ఆదివాసీ పోరుబిడ్డల కనీస ఆనవాళ్లు కూడా స్థానికంగా లేకపోవడం కలచివేసే విషయం. తెలంగాణ ఉద్యమ సమయంలో కొంతమంది ఉద్యమకారులు కలిసి స్థానిక చైన్‌గేట్ వద్ద రాంజీ విగ్రహం, వెయ్యిఉరుల మర్రి ప్రాంతంలో అమరవీరుల స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. వాటి ఆలనాపాలనా చూసే దిక్కులేక అవి సాయంత్రం సమయానికి మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి.

ముందడుగు పడింది..

వెయ్యిమంది అమరుల త్యాగాలకు ఇప్పుడిప్పుడే గుర్తింపు వస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రావడం, ప్రధాని మోదీ నిర్మల్‌కు వచ్చినప్పుడు రాంజీని స్మరించుకోవడం, బండి సంజయ్ నిర్మల్‌కు వచ్చిన ప్రతిసారీ ఇక్కడ నివాళులర్పించడంతో.. వెయ్యిఉరులమర్రి చరిత్ర క్రమంగా వెలుగులోకి వస్తోంది. ఇదేక్రమంలో తాజాగా ఓ అడుగు ముందుకు పడింది. వెయ్యిఉరుల మర్రిచెట్టు ఉన్న ప్రాంతంలోనే రాంజీగోండు స్ఫూర్తికేంద్రాన్ని నిర్మించేందుకు పాలకులు ముందుకు వచ్చారు. విజయ సంకల్పయాత్రలో పాల్గొనేందుకు బుధవారం నిర్మల్‌కు వచ్చిన బీజేపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్ఫూర్తికేంద్ర నిర్మాణానికి భూమిపూజ చేశారు. వెయ్యిఉరులమర్రి ఉన్న ప్రాంతంలోనే ఈ కేంద్రాన్ని నిర్మిస్తామని, అదికూడా ఏడాదిలో పూర్తి చేస్తామని వారు పేర్కొనడం గమనార్హం. ఇంతటి చరిత్ర ముందుతరాలకు అందించడం కోసం పార్టీలకతీతంగా కలిసిరావాలని వారు పిలుపునిచ్చారు. దీనిపై జిల్లావాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా వెయ్యిమంది అమరుల చరిత్రను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అమరుల పక్షాన అక్షర సమరం

కొన్నేళ్లుగా వెయ్యిఉరుల మర్రి అమరుల పక్షాన 'సాక్షి' దినపత్రిక చేస్తున్న అక్షరసమరంతో రాంజీ చరిత్ర గల్లీ నుంచి ఢిల్లీలో ఉపరాష్ట్రపతి వరకూ చేరింది. అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా స్పందించి రాంజీ లాంటి వీరులను గుర్తించాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ కూడా రాంజీని స్మరించేలా చేసింది. గతంలో పాలకులు, నాయకులు అమరధామం నిర్మాణంపై ఇచ్చిన హామీలను ఎప్పటికప్పుడు 'సాక్షి' గుర్తు చేస్తూ వస్తోంది.

ఓట్ల కోసం చరిత్ర మార్చొద్దు



రాంజీ స్ఫూర్తికేంద్రానికి భూమిపూజ చేస్తున్న బండి సంజయ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- కాపాడుకునేందుకు కలిసిరావాలి
- బీజేపీ నాయకులు బండి, ఏలేటి
- వెయ్యి ఉరులమర్రి వరకు బైక్‌ర్యాలీ

నిర్మల్: 'ఒకవర్గం ఓట్లకోసం ఆదివాసీవీరుల చరిత్రను తెరమరుగు చేసే కుట్ర చేస్తారా.. చరిత్రను తెరమరుగు చేయాలనుకున్న బీఆర్‌ఎస్ సర్కార్‌నే కనుమరుగు చేసిన చరిత్ర ప్రజలదని గుర్తుపెట్టుకోవాలి' అంటూ బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ విజయసంకల్పయాత్రలో భాగంగా బుధవారం జిల్లాకేంద్రానికి వచ్చారు. ముందుగా బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడి నుంచి ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్‌తో కలిసి బైక్‌ర్యాలీగా వెయ్యిఉరులమర్రి అమరుల స్మారకస్తూపం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో కలిసి రాంజీగోండు స్ఫూర్తికేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్మారకస్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెయ్యిఉరులమర్రి స్మారక ప్రాంతాన్ని కాపాడుకోవాలన్నారు. ఎక్కడ ఉరులమర్రి ఉందో అక్కడే స్ఫూర్తికేంద్రం నిర్మిస్తామన్నారు. వచ్చే ఏడాది నాటికి ఈ ప్రాంతాన్ని రాంజీగోండు స్ఫూర్తికేంద్రంగా, స్మృతివనంగా మారుస్తామన్నారు. ఈవిషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాంజీగోండు స్మారక ప్రాంతాన్ని వివాదాస్పదం చేయొద్దన్నారు. చరిత్రను మతం కోణంలో చూడవద్దన్నారు. వీరుల చరిత్రను చెరిపేయాలని చూస్తే అది కాంగ్రెస్‌కే నష్టమని, బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే ఆ పార్టీకీ పడుతుందని హెచ్చరించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, సంకల్పయాత్ర ప్రముఖ్ పల్లె గంగారెడ్డి, సహప్రముఖ్ రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, అసెంబ్లీ కన్వీనర్ విలాస్, పార్టీ పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, ప్రధాన కార్యదర్శి నరేశ్, జిల్లా, పట్టణ బాధ్యులు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గంలో పయనిద్దాం



అధికారులు, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

- ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు
- ఘనంగా జయంతి వేడుకలు

నిర్మల్: సంత్‌సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో పయనిద్దామని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని ముఖ్యఅతిథులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని దివ్యనగర్‌లో నిర్మిస్తున్న జగదాంబ ఆలయ ప్రాంగణంలో బుధవారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సేవాలాల్ చిత్రపటానికి కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావుపటేల్, అదనపు కలెక్టర్ ఫైజన్‌అహ్మద్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతిని ఏటా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. మారుమూల గిరిజన గూడేలు, తండాల్లో విద్య, వైద్యం, రవాణా తదితర సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని వివరించారు. సేవాలాల్ ఆశయ సాధనకు, బంజారాల అభివృద్ధికి కృషి చేస్తామని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మారుమూల గిరిజన తండాల రహదారుల నిర్మాణానికి రూ.100 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నామని చెప్పారు. నిరుపేదలకు ఇళ్లు, జిల్లాకేంద్రంలో ఆడిటోరియం, బంజారాభవన్, గురుకులం ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ మాట్లాడుతూ.. సేవాలాల్ చూపిన మార్గంలో నడుద్దామని సూచించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ.. బంజారాల సమస్యలను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జగదాంబ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు తనవంతు సాయం అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బంజారాల సంస్కృతీసంప్రదాయాలతో మహిళలు, చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆర్డీవో రత్నకళ్యాణి, కార్యక్రమ ఇన్‌చార్జి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీటీడీవో అంబాజీ, సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుకారాం, సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హాజరైన బంజారా మహిళలు

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత



మొరం తీయగా ఏర్పడిన గుంత

- అసైన్డ్ భూముల్లో అక్రమ దందా
- మొరం తరలిస్తున్న అక్రమార్కులు
- రూ.కోట్లలో కొల్లగొడుతున్న వైనం
- అధికారులకు తెలిసినా పట్టింపేది?

తానూరు: వ్యవసాయ భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం దశాబ్దాల క్రితం భూమి పంపిణీ చేసి వారి బతుకుకు భరోసా కల్పించింది. ఈ భూములను కొందరు సాగు చేసుకుంటుండగా.. ఇంకొందరు సాగుకు యోగ్యంగా లేదని అలాగే వదిలేశారు. ఎర్ర మొరం కావడంతో రోడ్లు, ఇంటి నిర్మాణాలకు బాగుంటుందని తెలవడంతో కొందరు అక్రమార్కులు వీటిపై కన్నేశారు. ఎకరాకు రూ.10వేల చొప్పున చెల్లించి లబ్ధిదారుల నుంచి లీజుకు తీసుకున్నారు. పంచాయతీ, రెవెన్యూ, భూగర్భ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండానే సదరు భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడ తీసిన మొరాన్ని మహారాష్ట్రలోని ధర్మాబాద్, ఉమ్రి, బిలోలి తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



గుంతలో పడి మృతి చెందిన సంబాజీ, రోధిస్తున్న బంధువులు (ఫైల్)

35 ఎకరాల్లో దందా..

తానూరు మండలంలోని సరిహద్దున గల ఎల్వత్ గ్రామపంచాయతీ శివారులో సర్వే నంబర్ 177లో 63.17 ఎకరాల భూమిని ప్రభుత్వం 16 ఏళ్ల క్రితం 41 మంది నిరుపేదలకు పంపిణీ చేసి పట్టాలు కూడా ఇచ్చింది. నిబంధనల ప్రకారం ఈ భూముల్లో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదు. పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. కాగా, మహారాష్ట్రకు చెందిన అక్రమార్కులు కొందరు రైతుల నుంచి ఈ భూములను లీజుకు తీసుకుని అక్కడ మొరం కోసం భారీ తవ్వకాలు చేపడుతున్నారు. సుమారు 35 ఎకరాల్లో ఈ దందా కొనసాగుతోంది. దీంతో 50 నుంచి 60 అడుగుల లోతువరకు మొరం తవ్వకాలు చేపట్టడంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. మహారాష్ట్రలో మొరం తవ్వకాలు చేపడితే ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో అక్కడి దళారుల కన్ను ఇక్కడి అసైన్డ్ భూములపై పడింది. కొందరు బడానాయకులతో చేతులు కలిపి లబ్ధిదారుల వద్ద భూమి లీజుకు తీసుకుని ఏకంగా ఫెన్సింగ్ వేస్తున్నారు. అధికారుల కళ్లుగప్పి రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు 20 నుంచి 30 టిప్పర్లలో మొరం తవ్వకాలు చేపట్టి మహారాష్ట్రలోని ధర్మాబాద్, బిలోలి, ఉమ్రికి రహదారుల నిర్మాణ పనుల కోసం తరలిస్తున్నారు. రూ.కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. మొరం తీసిన గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. అటువైపు వెళ్లిన రైతులు, పశువులు వాటిలో పడే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం 20 మంది లబ్ధిదారులకు చెందిన 35 ఎకరాల్లో ఈ దందా సాగుతోంది. మొరం తవ్వకాల కారణంగా ఈ భూములు సాగుకు పనికి రాకుండా పోతున్నాయి.

ఫిర్యాదులు చేసినా..

మొరం అక్రమ తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వాటిలో నీరు నిలువగా పశువులు తాగేందుకు వెళ్లి అందులో పడి మృత్యువాత పడుతున్నాయి. 2022 నవంబర్ 13వ తేదీన ధర్మాబాద్ పట్టణానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఉగేవాడ్ సంబాజీ (40) తవ్వకాలు జరిపిన గుంతలో నీరు తాగేందుకువెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదు. భారీ వాహనాల కారణంగా వచ్చే దుమ్ము పంటల చేలపై చేరి పంటలు ఎదగడం లేదు. అక్రమ తవ్వకాలు చేపడుతున్న వారిపై వ్యాపారులు, అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

చర్యలు తీసుకుంటాం

నిరుపేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలు చేపట్టరాదు. అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. గ్రామాన్ని సందర్శించి తవ్వకాలు నిలిపివేస్తాం. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వ్యాపారుల చేతిలో ఉన్న లీజు భూములను బాధిత రైతులకు అందించి సాగుకు ఉపయోగపడేలా చూస్తాం.

– క్రాంతికుమార్, జిల్లా మైనింగ్ అధికారి

నోటీసులు ఇస్తాం

అసైన్డ్ భూములైనా, పట్టాభూములైనా మొరం తవ్వకాలు జరిపినప్పుడు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. కొందరు మహారాష్ట్రకు చెందిన వారు అనుమతి లేకుండా రాత్రి మొరం తవ్వకాలు చేపడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. అక్రమ తవ్వకాలను పరిశీలించి సదరు వ్యక్తులకు నోటీసులు అందజేస్తాం, మొరం తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– లింగమూర్తి, తహసీల్దార్, తానూరు

పీఎం స్వనిధి.. పేదల పెన్నిధి

భైంసాటౌన్: కరోనా కాలంలో ఆర్థికంగా చితికిపోయిన వీధి వ్యాపారులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి కింద తక్కువ వడ్డీతో రుణాలు అందించింది. పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో మొదటి విడతలో ఏడాది గడువుతో రూ.10వేల చొప్పున రుణం అందించగా, సకాలంలో చెల్లించిన వారికి ఏడాదిన్నర గడువుతో రెండో విడతలో రూ.20వేల చొప్పున ఇచ్చింది. రెండు సార్లు సక్రమంగా రుణం చెల్లించినవారికి ప్రస్తుతం రూ.50వేల చొప్పున రుణం ఇస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యం చేరుకోవాల్సి ఉండగా, ఇప్పటివరకు 57శాతమే పూర్తయింది. రుణాలు సకాలంలో చెల్లించినవారికే సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు ఇస్తున్నారు. మొదటి, రెండు విడతల్లో చాలామంది సక్రమంగా చెల్లించకపోవడంతో మూడోవిడతకు దూరమయ్యారు.

జిల్లాలో మంజూరు ఇలా..

నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో మొదటి విడతలో 9,263 మందికి రూ.10వేల చొప్పున రుణం అందించాల్సి ఉండగా, లక్ష్యానికి మించి 9,565 మందికి ఇచ్చారు. రెండోవిడతలో 5,610 మందికి రూ.20వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా, 5,681 మందికి అందించారు. ప్రస్తుతం రూ.50వేల చొప్పున 3,005 మందికి అందించాల్సి ఉండగా ఇప్పటివరకు 1,731 మందికి ఇచ్చారు. మార్చి నెలాఖరులోగా వందశాతం లక్ష్యం చేరుకుంటామని మెప్మా పీడీ సుభాష్ తెలిపారు.

సంఘటితమైతేనే మతోన్మాదంపై పోరు

నిర్మల్‌ఖిల్లా: ప్రజలంతా సంఘటితమైతేనే మతోన్మాద వ్యవస్థపై పోరాడవచ్చని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా 'మతం, మతోన్మాద ప్రమాదం–అభ్యుదయ శక్తుల కర్తవ్యాలు' అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. దోపిడీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలంటే ప్రజలంతా సంఘటితశక్తిగా ఎదగాలని సూచించారు. కొన్ని శక్తులు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ శక్తులపై కమ్యూనిస్టులు నిరంతరం పోరాటం చేస్తారని తెలిపారు. నాయకుడు ఫసియొద్దీన్, కార్యవర్గ సభ్యులు నూతన్‌కుమార్, బొమ్మన సురేశ్, సుజాత, తొడసం శంభు, గంగామణి, పోశెట్టి, అతిక్, దిగంబర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న వక్తలు

క్లుప్తంగా

వీడియోలు పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


డీఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రెడ్డి సంఘం పేరిట సోషల్ మీడియాలో అశ్లీల వీడియోలు పోస్టుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రెడ్డి సంఘం నాయకులు బుధవారం డీఎస్పీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు డీఎస్పీని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి కులస్తుల పేరిట పోస్టులు చేసి అవమానపర్చే విధంగా చేస్తున్నారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, రాంరెడ్డి, శివప్రసాద్, స్వప్నిల్, కిరణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లిలో గల ఖిల్లా హైస్కూల్‌లో ఈ నెల 19న రాత్రి చోరీ జరిగింది. మధ్యాహ్న భోజనానికి సంబంధించి పాఠశాలలో నిల్వ ఉంచిన 3 క్వింటాళ్ల బియ్యం, ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాహెద బేగం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బేల మండలం సైద్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నగూడకు చెందిన మడావి రాము గంజాయి సాగు చేస్తున్నారు. సుభాష్ నగర్‌కు చెందిన బాబాఖాన్, భార్య సాజిదాబీకి ముందుగా 1000 గ్రాముల గంజాయిని విక్రయించాడు. మిగిలిన మరో 200 గ్రాముల గంజాయిని గురువారం విక్రయించేందుకు తీసుకెళ్తుండగా సుభాష్‌నగర్ వంతెన సమీపంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 1,200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న పల్లవి

ఖానాపూర్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎఫ్‌పీఎస్‌టీ, టీబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఖానాపూర్ విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి పల్లవి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం సంధ్యారాణి, గైడ్ టీచర్ సుస్మారాణి, స్రవంతి తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుదని ఉపాధ్యాయులు తెలిపారు.

కాంట్రాక్టర్ దోపిడీ


రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న రిమ్స్ కార్మికులు

- వేతనం నుంచి రూ.2 వేలకు పైగా కోత
- రిమ్స్ కార్మికుల కష్టార్జితం కాంట్రాక్టర్ పాలు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఏడాదికి పైగా ఇదే తంతు
- నేటి నుంచి నిరసన..
- స్పష్టత ఇవ్వకపోతే మార్చి 7 నుంచి సమ్మె

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో ఓ కాంట్రాక్టర్ కార్మికుల పొట్ట కొడుతున్నాడు. అసలే చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న వారి జీతాల్లోంచి కోత విధిస్తున్నాడు. కలెక్టర్ నుంచి డీఎంఈ స్థాయి అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కార్మికుల పక్షాన ఉండాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సదరు కాంట్రాక్టర్ 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా మారింది. దీంతో విసుగుచెందిన కార్మికులు సమ్మె బాటకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి రోజుకు గంట పాటు రిమ్స్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. పరిస్థితిలో మార్పురాకుంటే మార్చి 7 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

కార్మికుల పొట్టగొడుతున్న కాంట్రాక్టర్..

రిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్‌కేర్‌లు దాదాపు 500 మంది పనిచేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ కార్మికుల వేతనాల్లో కోత విధిస్తూ నిబంధనలను తుంగలో తొక్కి తనకు నచ్చిన విధంగా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాడు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తారేమోననే భయంతో కార్మికులు ఏం చేయలేక పోతున్నారు. గతేడాది రిమ్స్‌కు వచ్చిన అప్పటి డీఎంఈ రమేశ్‌రెడ్డిని కార్మికులు కలిసి తమగోడు వెల్లబోసుకున్నారు. ఆ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు కాంట్రాక్ట్ రద్దు చేస్తామని చెప్పారు. గతంలో పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల కోసం..

సదరు కాంట్రాక్టర్ దాదాపు రెండేళ్ల క్రితం రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్, సానిటేషన్, పేషెంట్‌కేర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం 0.01 (ఒకపైన) శాతం కమీషన్‌పై కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. నిబంధనల ప్రకారం నెలకు ఒక్కో కార్మికుడికి రూ.15,600 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.12,093 కార్మికుడి ఖాతాలో జమ చేయాలి. రూ.3,023 పీఎఫ్ కట్టాలి. రూ.484 ఈఎస్‌ఐ జమ చేయాలి. ఇందుకు భిన్నంగా కార్మికులకు నెలకు రూ.11వేలు అకౌంట్‌లో జమ చేస్తున్నాడు. పీఎఫ్ రూ.వెయ్యి, ఈఎస్‌ఐ రూ.200 వరకు చెల్లిస్తున్నాడు. ఆస్పత్రి నిర్వహణ కోసం ప్రభుత్వం 5 శాతం కమీషన్ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తుంది. తాను దక్కించుకున్న 0.01 శాతం కమీషన్ కూడా ఇస్తోంది. ఇది సరిపోదన్న రీతిలో కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాడు. అయితే అతను అందుబాటులో ఉండకుండా హైదరాబాద్‌లో ఉండటం, అక్కడి నుంచే వ్యవహారాలను సాగిస్తుండడంతో కార్మికులు తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకో వాలో తెలియని పరిస్థితి ఉందంటున్నారు. అధికారులను ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదని దాట వేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేతనాల్లో కోత విధిస్తున్నాడు



గతంలో ఉన్న కాంట్రాక్టర్ కూడా పీఎఫ్ కాజేశాడు. ప్రస్తుత కాంట్రాక్టర్ సైతం వేతనాల్లో కోతలు విధిస్తున్నాడు. పలుమార్లు రిమ్స్ డైరెక్టర్‌తో పాటు డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. నెలకు రూ.15,600 చెల్లించాల్సి ఉండగా, రూ.13వేల వరకు కూడా జీతం రావడం లేదు. కాంట్రాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. వేతనం అందకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం.

– జి.సంగీత, పేషెంట్‌కేర్

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి. కాంట్రాక్టర్ నిబంధనలు ఉల్లంఘించి వేతనాల్లో కోత విధిస్తున్నాడు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నెలకు రూ.11వేలు మాత్రమే ఖాతాలో జమ అవుతున్నాయి. పీఎఫ్, ఈఎస్‌ఐ పోనూ నెలకు రూ.12,093 వేతనం అందాల్సి ఉంది. కాంట్రాక్టర్ ఇష్టారీతిన కోతలు విధిస్తున్నాడు.

– ముజీబ్, సెక్యూరిటీ గార్డ్

పరిష్కరించకుంటే సమ్మెబాట



కాంట్రాక్టర్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను నిలువునా దోచుకుంటున్నాడు. ఒక్కో కార్మికుడి నుంచి ప్రతినెల రూ.2వేలకు పైగా వేతనంలో కోత విధిస్తున్నాడు. గురువారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతాం. సమస్య పరిష్కారం కాకపోతే మార్చి 7 నుంచి సమ్మెకు దిగుతాం.

–సిర్ర దేవేందర్, తెలంగాణ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


తానూరు: పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

తానూరు: భైంసా నుంచి తానూరు మండలం బెల్‌తరోడా గ్రామానికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బెల్‌తరోడా రహదారిపై పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. బుధవారం భైంసా సుద్దవాగు నుంచి ట్రాక్టర్‌లో బెల్‌తరోడా గ్రామానికి ఇసుక తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కుంటాలలో...

కుంటాల: మండలంలోని ఓలా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను బుధవారం తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పట్టుకున్నారు. ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారంగపూర్‌లో..

సారంగపూర్: మండలకేంద్రం మీదుగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకుని తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ శ్రీదేవికి అప్పగించినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు తహసీల్దార్ వద్ద అనుమతి తీసుకున్న తర్వాతే ఇసుకను తరలించాలని, లేనిపక్షంలో వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

దిలావర్‌పూర్‌లో...

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామ పరిసర వాగునుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ బి.స్వాతి, మైనింగ్ అధికారి క్రాంతికుమార్ సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం సెపక్ తక్రా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-14, అండర్-18 క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఈనెల 24, 25 తేదీల్లో నల్గొండలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్ 9948629413, కోచ్ కుమ్మరి మల్లేశ్‌ను 9032126050 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న సీబీఎస్‌ఈ 'పది' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ (సీబీఎస్‌ఈ) పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాలకు అనుమతించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్షలు జరిగాయి. కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో హిందీ పరీక్షకు 34 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సాత్నాల కెనాల్‌లోపడి వృద్ధురాలు మృతి

జైనథ్: మండలంలోని మేడిగూడ(ఆర్) గ్రామానికి చెందిన బోడకుంట సుశీల (90) ప్రమాదవశాత్తు సాత్నాల కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. మృతురాలికి కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో గ్రామంలో తిరుగుతూ ఉండేది. బుధవారం ఎప్పటిలాగే ఇంటి నుండి బయటకు వెళ్లింది. మధ్యాహ్న మేడిగూడ(సీ) గ్రామస్తులు కాలువలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడు బోడకుంట గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ గుర్తింపు

మంచిర్యాలటౌన్: ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న మహిళను బుధవారం రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రీరాముల వెంకటలక్ష్మి(41)గా ఆమె బంధువులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతురాలికి భర్త మురళి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అనిల్ (ఫైల్)

మందమర్రిరూరల్(చెన్నూర్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎస్పీ రోడ్డు అంగడి బజార్‌కు చెందిన బండి అనిల్ (26) మేకల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున పనినిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎర్రగుంటపల్లె రోడ్డు మూల మలుపు వద్ద కిందపడి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని మృతుని సోదరుడు బండి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు


శిబిరంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

భైంసా: కర్ణాటక ప్రభుత్వం గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఈ నెల 6నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరితోపాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి జాతీయ సేవా పథకంలో పనిచేసే వలంటీర్లు హాజరయ్యారు. ఇందులో భాగంగా తెలంగాణ బతుకమ్మ, తెలంగాణ బోనాలు, పీర్ల పండుగకు సంబంధించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. పలు రాష్ట్రాలకు చెందిన వలంటీర్లంతా సమైక్యత శిబిరంలో పాల్గొనడం గొప్ప విషయమని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వలంటీర్లను బుధవారం ట్రిపుల్‌ఐటీలో సన్మానించారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సంతోష్ కుమార్

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈడీఐఐ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆక్సెంచర్ ఇంటర్ పినర్షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మండలంలోని మహిళలకు ఆహారం, వ్యవసాయం (ఫుడ్ ప్రాసెసింగ్)పై ఉచిత శిక్షణ తరగతులను ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ శిరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రెనింగ్ 26 రోజుల పాటు ఇక్కడే ఉంటుందన్నారు. మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీ రవి, దినేష్, ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, ఏపీఎం శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

మేడారం వెళ్తున్న బస్సును ఢీకొన్న లారీ

- 20 మంది ప్రయాణికులకు గాయాలు


సంఘటన స్థలంలో బస్సు, లారీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపో నుంచి (కామారెడ్డి బస్సు) మేడారం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మంగళవారం రాత్రి 9:30 గంటలకు మంచిర్యాలకు చెందిన 49 మంది ప్రయాణికులు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. భూపాలపల్లి జిల్లా కాటారం సమీపానికి చేరుకోగానే రాత్రి దాదాపు 12:10 గంటలకు బస్సు, లారీ ఢీకొన్నాయి. ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. బస్సు డ్రైవర్ ఎంఎం అలీ కాలు, చేతులకు, ఇస్మాయిల్‌కు నడుం, కండక్టర్ బాలయ్యకు గాయాలయ్యాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. క్షతగాత్రులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జాతరకు వెళ్లి.. ప్రమాదానికి గురై...

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి చిన్నక్క, పెంచాల శ్రీనివాస్, ముడివెల్లి వెంకటేష్, నీలం సుస్మిత కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్సులో మేడారం జాతరకు బయలుదేరారు. భూపాలపల్లి సమీపంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న బస్సును వెనుకనుంచి వచ్చిన బొగ్గు లారీ ఢీకొట్టింది. క్షతగాత్రులను భూపాలపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.


గాయపడిన లావణ్య


గాయపడిన చిన్నక్క


గాయపడిన అశ్రిత

నెన్నెల వాసులకు గాయాలు

నెన్నెల: భూపాలపల్లి జిల్లా మేడిపల్లి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో నెన్నెలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుడు తోట రాజేశ్, సుమలత, దంపతులు, అక్క తోట భూమక్కతో కలిసి మేడారం బయలు దేరారు. బస్సు ప్రమాదానికి గురికావడంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ

- వెలుగులోకి ధాన్యం అక్రమాలు
- మిల్లులో 36,091 సంచులు మాయం


తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహ రైస్‌మిల్లులో బుధవారం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఇందులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం మిల్లింగ్‌కు శ్రీ లక్ష్మీనరసింహ రైస్‌మిల్లుకు 38,265 బ్యాగుల ధాన్యం కేటాయించగా 2,174 బ్యాగుల ధాన్యం మాత్రమే అందుబాటులో ఉంది. అందులో 36,091 వరిధాన్యం బ్యాగులు కనుమరుగయ్యాయి. ఈ మేరకు శ్రీ లక్ష్మీ నరసింహా రైస్‌మిల్లుపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ ముబిన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల వేళ ప్రక్షాళన

- అన్ని శాఖల్లో అధికారులకు స్థానచలనం
- విధుల్లో చేరిన అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో బదిలీల కోలాహలం నెలకొంది. అన్ని శాఖల్లోనూ బదిలీల ప్రక్షాళన సాగుతోంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు దీర్ఘకాలంగా ఒకే చోట కొనసాగుతున్న అధికారులకు స్థానచలనం కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ మద్దతుదారులుగా ముద్రపడి ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు ఎదుర్కొన్న వారందరినీ బదిలీ చేశారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, రవాణాశాఖ ఇలా అన్ని శాఖల్లో ఉన్నతాధికారులు మారారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈవీఎంల మొదటి స్థాయి పర్యవేక్షణ పూర్తి కాగా సెక్టోరియల్ అధికారుల శిక్షణ, ఎన్నికల సిబ్బంది సమాయత్తంపై చర్యలు చేపట్టారు.

పోలీసుశాఖలో..

రామగుండం పోలీసు కమిషనర్‌గా ఎం.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఏసీపీగా ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీగా వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీగా రవికుమార్ విధుల్లో చేరారు. జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఎక్సైజ్ సీఐ బదిలీపై వెళ్లారు.

- జెడ్పీలో సీఈఓగా గణపతి, డెప్యూటీ సీఈఓగా రవీందర్, డీఆర్‌డీఓగా కిషన్, మంచిర్యాల, బెల్లంపల్లి డీఎల్‌పీఓలు, జిల్లాలోని 16 మండలాల్లోని ఎంపీడీఓలు, 11 మండలాల్లో తహసీల్దార్లు, నస్పూర్, మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా యువజన క్రీడల శాఖా అధికారి, డీపీఆర్ఓ బదిలీ అయ్యారు.

మూకుమ్మడిగా..

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని డీటీఓ, ముగ్గురు ఎంవీఐలు, ముగ్గురు ఏఎంవీఐలను మూకుమ్మడిగా బదిలీ చేశారు. వారి స్థానాల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు విధుల్లో చేరారు.

పొలాస విద్యార్థుల పొలంబాట


సాగు ప్రదర్శనలు పరిశీలిస్తున్న విద్యార్థులు

జైపూర్(చెన్నూర్): ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు పొలంబాట పట్టారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు బుధవారం జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ పంటపొలాలను పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో సేద్య విధానాలు, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం జైపూర్ రైతు వేదికలో సామాజిక వనరుల గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తూలనం, ప్రిఫరెన్స్ ర్యాంకింగ్, సమస్యల చెట్టు, కాలక్రమం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ, నాగరాజు, ఏడీఏ రాజేశం, ఏవో మార్క్‌గ్లాస్టన్, ఏఈవో కొమురయ్య, విద్యార్థులు హర్షిత్, సుశాంత్, శ్రీవత్స, రాంప్రసాద్, వివేక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి'

భైంసాటౌన్: రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాట్లాడుతూ.. బాసర ఆర్జీయూకేటీలో సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందని, త్వరలోనే ట్రిపుల్‌ఐటీని సందర్శించాలని కోరుతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు అంజద్ షేక్, నాయకులు అమీర్, నవీన్,రమేష్ ఉన్నారు.

రైతులకు అవగాహన

ముధోల్: మండలంలోని రామ్‌టెక్ గ్రామంలో బుధవారం రీలయన్స్ ఫౌండేషన్ డీపీవో లక్ష్మణ్ రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటసాగుతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలన్నారు. గొర్రెలు, మేకలకు మాత్రలు సకాలంలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జీవాలకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌డీ సంస్థ మండల కోఆర్డినేటర్ రాథోడ్ గణపతి, రైతులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆలయ సిబ్బంది



సెల్‌ఫోన్ అందిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా: బాసర సరస్వతీ ఆలయంలో బుధవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న భూమన్నకు ఈ ఫోన్ దొరికింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన రమణారెడ్డికి చెందిన ఫోన్‌గా గుర్తించారు. భక్తుడిని పిలిచి ఫోన్ అందించారు. ఫోన్‌ను భక్తుడికి అందించిన ఆలయ సిబ్బంది భూమన్నను పలువురు అభినందించారు.

మన్మద్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగాదేవి సహిత శివ పంచాయతనం స్థిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు నాలం సంతోష్ కుమార్ జోషి బుధవారం నిర్వహించారు. చండీయాగం, అష్టోత్తర శతకలశ హహన్నపనం అత్యంత వైభవంగా జరుపుతున్నారు. వేద పండితులు విద్యాపనింద్ర శర్మ, ప్రతరన్ శర్మ, గంగాపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: మండల కేంద్రం ముధోల్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మక్బూల్ హైమ్మద్ రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడు బీఆర్ఎస్ మెంబర్‌షిప్ తీసుకోవడంతో అతడి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ తరుపున బీమా రూ.2లక్షలు మంజూరు కాగా బుధవారం ఆ చెక్కును బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మగ్దూమ్, మండల రైతుబంధు అధ్యక్షులు రామ్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ఎక్స్ ఎంపీటీసీ పోతన్న, ఎక్స్ వైస్ ఎంపీపీ ఎజాజ్ ఉద్దీన్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన రెవిల్లి నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి బుధవారం జైజవాన్ జైకిషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండేరి దినేశ్, నాసాని మల్లేశ్, నాగమొగి, ఇబిది కిరణ్, చేని శ్రావణ్, రామకృష్ణ ఉన్నారు.

జాతరకు వేళాయె..



పూజలు నిర్వహిస్తున్న వేద పండితుడు గురుమంచి చంద్రశేఖర్ శర్మ

గజ్జలమ్మ జాతర ప్రారంభం

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఘనంగా గజ్జలమ్మ జాతర ప్రారంభించారు. వేద పండితులు గురు మంచి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉదయం భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహాగణపతి పూజ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, సంస్కారం, వాస్తు క్షేత్రపాలక, నవగ్రహ, యోగిని, కర్కరి, సర్వతోభద్ర మండల స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, స్థాపిత దేవత హోమం, రథజాలాభిషేకం, హారతి, కుంకుమార్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం జామ్



హోమంలో పాల్గొన్న దంపతులు

గ్రామానికి చెందిన అల్లాడి కవిత- వెంకటనర్సయ్య దంపతులు అన్నదానానికి అవసరమయ్యే రూ.లక్ష విలువ చేసే ప్లేట్లను విరాళంగా అందజేశారు. భైంసాకు చెందిన కోర్వ ప్రణీత - శ్రీనివాస్ దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముజ్గిమల్లన్న జాతరకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్: జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరయ్యే ముజ్గిమల్లన్న జాతరకు ఏర్పాట్లు ప్రారంభించారు. నిర్మల్‌రూరల్ మండలంలోని ముజ్గి గ్రామంలోని మల్లన్న ఆలయంలో ఈ జాతరను ప్రతీఏడాది నిర్వహిస్తున్నారు. ఈనెల 23 నుంచి 25వరకు జాతర కొనసాగనుంది. ఈమేరకు రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, మాజీ సర్పంచ్ భూషణ్, మల్లేశ్‌లు ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్వాహకులకు సూచించారు.

రేపు మల్లన్న దేవుని..

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శుక్రవారం మల్లన్నదేవుని జాతర ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరలో భాగంగా శుక్రవారం మల్లన్న దేవుని కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం చల్లని అంబల్లు కార్యక్రమం నిర్వహించనున్నారు.



గ్రామంలో పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

మల్లన్న దేవుని పల్లకిని ఆదివారం ఊరేగించనున్నారు. సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. సోమవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. చివరి రోజు మంగళవారం అంబలికుండ ఇంటికి తేవడంతో జాతర ముగుస్తుంది. జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం గ్రామంలో పల్లకి ఊరేగింపు నిర్వహించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: సరస్వతి కాలువ పరిధిలోని ఖానాపూర్, కడెం, పెంబి మండలాల్లోని డిస్ట్రిబ్యూటరి-27, డిస్ట్రిబ్యూటరి-28 కాలువల చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడికుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామాల్లోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సమస్య, త్రీఫేజ్ విద్యుత్, రహదారులు, వంతెనల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు సదర్మాట్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగ సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. అంతకముందు ఆదివాసీలు ఎమ్మెల్యే డోలు, వాయిద్యాల మధ్య ఘనస్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంకుశ్‌రావు, ఉర్వత ఆనంద్, మాడవి లింగు, సోనేరావు, దయానంద్, చిన్నం సత్యం, యూసుఫ్‌ఖాన్, మాజిద్, నిమ్మల రమేశ్, భీంరావుపటేల్, నైతం శ్రీనివాస్, రాజేశ్వర్, నంది రామయ్య, తిలక్‌రావు, పెందూరి మాదవ్, గంగనర్సయ్య, తోట సత్యం, నర్సయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

'ఆదర్శ'లో వీడ్కోలు అదరహో..



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఫ్యాషన్ షో చేస్తున్న విద్యార్థులు

కుంటాల: కుంటాలలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశం ఆకట్టుకుంది. విద్యార్థులు పాఠశాలలో అనుభవాలు గుర్తు చేసుకున్నారు. పలువురు పాడిన పాటలు, డ్యాన్స్‌లు, నాటికలతో ఆడిపాడారు. విద్యార్థుల ప్రదర్శనలు తోటి విద్యార్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూరిబాలో..

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు పార్టీ వేడుకలు అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు, ఉపన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్‌వో తిరుమల అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

'వచ్చే ఎన్నికల్లో విజయం మనదే'



సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న నాయకులు

సోన్: మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు మండల బీజేపీ నాయకులు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన కుమురంభీం విజయ సంకల్ప యాత్రలో పాల్గొనడానికి వెళ్తున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బర్ల మానస హరీష్‌రెడ్డి, సందుగారి నవీన్, మేకల అశోక్, సాయికృష్ణ, కొక్కుల సాగర్, గంగయ్య, గంగారెడ్డి ఉన్నారు.

కళాశాల వార్షికోత్సవం

లోకేశ్వరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలను సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ తుకారం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మికల్యాణ మండపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. అధ్యాపకులు వినోద్, చిన్నయ్య, శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

కుభీర్: మండలంలోని కస్రాగ్రాంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిరంలో విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి పాల్గొని పూజలు చేసి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తూము లక్ష్మిబాయి, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంఖర్, పీఏసీఎస్ చైర్మన్ రేకుల గంగాచరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు మౌలానా అబుల్‌కలాం వర్ధంతి

నిర్మల్: స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ వర్ధంతిని గురువారం నిర్వహించనున్నట్లు కలాంగుణం సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అబుల్‌కలాం చౌరస్తాలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కుంటాల: సూర్యాపూర్ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.3.50 లక్షల నిధులు మంజూరు చేసింది. బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు రొడ్డ మల్లేష్, నాయకులు కమలాకర్, పోతన్న, రమేష్ పాల్గొన్నారు.

మురికి కాలువల నిర్మాణానికి భూమిపూజ

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బుధవారం సీసీరోడ్డు, మురికి కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రత్యేక నిధుల నుంచి సీసీరోడ్లకు 6లక్షలు, మురికి కాలువలకు రెండు లక్షల నిధులు కేటాయించామని పేర్కొన్నారు. పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు. ఈయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ నర్సయ్య, నాయకులు ముత్యంరెడ్డి, విలాస్‌రావు, అశోక్, శ్రీనివాస్, పోతన్న ఉన్నారు.

కుభీర్‌లో..



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

కుభీర్: మండల కేంద్రంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావు పటేల్ ప్రారంభించారు. అంతకు ముందు నూతనంగా నిర్మించిన కాంగ్రెస్ గద్దెపై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సమావేశమైన కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామస్తులందరూ ఐక్యమత్యంతో ఉండి అభివృద్ధి చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుందని వివరించారు. ఇందులో ఎంపీపీ తూము లక్ష్మిబాయి, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావు పటేల్, శంకర్ చంద్రే, బంక బాబు, జావేద్‌ఖాన్, జి.బాబు, వివేక్, బంక రాములు, బంక విఠల్ ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల పార్టీ కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. మంజూరైన రూ.3లక్షల ఉపాధి హామీ నిధులతో పనులను చేపడుతున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

నయనానందకరం లక్ష్మీనర్సింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలోని అక్కకొండ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20న ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనర్సింహుడి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణచార్యులు నయనానందకరంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉమ్మడి జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు క్యాలెండర్, కరపత్రాల దాత మూడికె మల్లేశ్ యాదవ్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ నెల 24న రథోత్సవంతో పాటు జాతర ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజరమేశ్‌గౌడ్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



జీపీ కార్యదర్శులతో మాట్లాడుతున్న తహసీల్దార్

దస్తురాబాద్: అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సర్ఫరాజ్ నావాజ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇసుకను తరలించేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ పరిధిలో ఇసుకను తరలించే ట్రాక్టర్లను గుర్తించి వారి యజమానులకు తెలుపాలని కోరారు. ఇసుకను తరలించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో అనుమతులు పొందాలని వివరించారు. అనుమతులు లేకుండా తరలిస్తే పంచాయతీ కార్యదర్శులు వాహనాలను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలన్నారు. మండల ఎంపీవో అనిల్, డిప్యూటీ తహసీల్దార్ నాయక్‌రావ్, ఆర్ఐ గంగన్న పాల్గొన్నారు.



లోకేశ్వరం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: అక్రమంగా సుద్దవాగు నుంచి ఇసుక తరలిస్తేవారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మోతీరాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల కార్యదర్శులకు, రెవెన్యూ సిబ్బందికి ఇసుక తరలింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మోతీరాం మాట్లాడుతూ పుస్పూర్, హవర్గ, బీలోలి, సాథ్‌గాం, హద్గాం, మన్మద్, పోట్‌పల్లి గ్రామాల సమీపంలోని సుద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సుద్దవాగు నుంచి ఇసుక తరలించడంతో రోజురోజుకూ భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై దిగంబర్, డెప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ బాలకృష్ణ ఉన్నారు.

నిందితుడిని శిక్షించాలి

ఖానాపూర్: అలేఖ్యను నడిరోడ్డుపై కత్తితో నరికిచంపిన ప్రేమోన్మాది శ్రీకాంత్‌కు కఠిన శిక్షవేయడంతో పాటు బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలోని అలేఖ్య కుటుంబీకులను పరామర్శించారు. అలేఖ్య కేసు విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సఖికేంద్రానికి వెళ్లి కేంద్రం నిర్వాహకురాలు మమతతో అలేఖ్య కేసు విషయమై మాట్లాడారు. అంతకముందు పట్టణంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట నాయకులు పుప్పాల శంకర్, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్ ఉన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రేఖానాయక్

మహాదేవాలయంలో శివలింగ ప్రతిష్ఠాపన



మాట్లాడుతున్న బాలయోగి రాములు మహరాజ్



సారంగపూర్: హోమం నిర్వహిస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని ఎడ్దూర్ గ్రామంలో మహా దేవాలయ శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా భూవనేశ్వర్ వేద పండితుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కుంబాభిషేకం, ధాన్య దివాసం, పుణ్యవచనం చేశారు. ఈ సందర్భంగా నందిపేట్ పలుగుట్ట బాలయోగి రాములు మహారాజ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలన్నారు. ప్రతి వ్యక్తి నిత్యం ఆయా గ్రామాల్లోని దేవతలకు పూజలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో భక్తులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పట్టాభిరామ విగ్రహ ప్రతిష్ఠాపన

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించిన నూతన పట్టాభి రామాలయంలో పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మహాయాగం చేపట్టారు. ఈనెల 23వ తేదీన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ అర్చకులు రామక్రిష్ణ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన సూచించారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

భైంసాటౌన్: పట్టణంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు, భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర

ముథోల్: మండంలోని ఎడ్‌బిడ్ తండాలో బుధవారం గిరిజనుల ఆరాధ్యదైవమైన సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కనుకవనం నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మవారి దర్శనానికి భక్తులుభారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ స్థాపకులు రేణుకమ్మ, దేవాలయ ధర్మకర్త జాదవ్ సతీష్‌కుమార్‌లు అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



సారలమ్మను తీసుకొస్తున్న భక్తులు

ఎన్నిక

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో నిర్మల్, సోన్ మండల విగ్నేష్ ఆర్ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. గౌరవ సలహాదారులు వెంకటస్వామి, మనోహర్‌ల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.